

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

● కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు తడి పొడి చెత్తను వేరు చేసి డంపు యార్డుకు చెత్తను తగ్గించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నగరంలోని మల్కాపూర్, లక్ష్మీపూర్, కొత్తపల్లిలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. మల్కాపూర్, కొత్తపల్లిలో గతంలో వినియోగించిన డంపు యార్డులను, డీఆర్‌సీసీ సెంటర్, వర్మికంపోస్టు పిట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంట్లో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే చెత్తను ఇంట్లోనే వేరు చేసి బుట్టల ద్వారా నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని సూచించారు. చెత్తను సేకరించి స్వచ్ఛ ఆటోల ద్వారా కొత్తపల్లి, మల్కాపూర్ డంపు యార్డు వద్ద పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు, ఇతర వస్తువులను డీఆర్‌సీసీకి తరలించాలన్నారు. తడి చెత్తను స్థానికంగా ఉన్న వర్మికంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చాలన్నారు. సెగ్రిగేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి డంపు యార్డుకు వెళ్లే చెత్తను పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. నగరవ్యాప్తంగా ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను కార్మికులు తప్పకుండా సేకరించి వంద శాతం సెగ్రిగేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను ఈ నెల 20 నిర్వహించనున్నామని, ఈ సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ముద్రించిన సమ్మె వాల్‌పోస్టర్‌ను కరీంనగర్‌లోని బైపాస్‌రోడ్‌లోని సిమెంట్ గోదాంవద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జంగం తిరుపతి, బాగోతం వీరయ్య, నన్నవేని శ్రీనివాస్, ననవేని కొమురయ్య, పల్లెర్ల రాములు గౌడ్, ముత్యాల శ్రీనివాస్, దానవేని కొమురయ్య, ఉప్పారం శ్రీనివాస్, జక్కుల ఐలయ్య, దొంగల శ్రీనివాస్, బోయిని ఐలయ్య పాల్గొన్నారు.

జోరుగా కొనుగోళ్లు



- ఇప్పటి వరకు కొన్న ధాన్యం విలువ రూ. 430 కోట్లు
- రైతులకు చెల్లించింది రూ. 306.51 కోట్లు
- చెల్లించాల్సిన బకాయి రూ. 123.66 కోట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వరి కోతలు పూర్తికావస్తుండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రద్దీ పెరిగింది. ప్రతి కేంద్రానికి వందలాది క్వింటాళ్ల వరిధాన్యం వచ్చి చేరుతున్నది. యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 1,85,421 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేశారు. 27,903 మంది రైతులకు చెందిన ఈ ధాన్యం విలువ 430.18 కోట్లు కాగా ఇప్పటికే 306 కోట్ల 51 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 123.66 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉన్నది.

● జిల్లాలో 2,66,896 ఎకరాల్లో వరి సాగు

జిల్లావ్యాప్తంగా యాసంగిలో 2,66,896 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇందులో 1,99,051 ఎకరాల్లో దొడ్డు రకాలను, 67,845 ఎకరాల్లో సన్నరకాలను సాగు చేశారు. ఈ సీజన్‌లో 5,86,723 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో రైతుల సొంత అవసరాలకు మినహాయించుకునే ధాన్యంతోపాటు విత్తన పంటను మినహాయిస్తే 3.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఇందులో 2,74,900 మెట్రిక్ టన్నుల దొడ్డురకం వరిధాన్యం, 85,054 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం రైతులు తీసుకువస్తారని భావించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 1,85,421 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. ఇందులో 1,65,761 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డురకానికి చెందినది కాగా, 19,660 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకానికి చెందినది. జిల్లా యంత్రాంగం వేసిన అంచనాల్లో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలకు వచ్చింది 50 శాతం మాత్రమే కావడం గమనార్హం. గత సీజన్‌లో ఇదే రోజు వరకు కొనుగోలు చేసిన ధాన్యంతో పోల్చితే 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కువే కొనుగోలు చేశారు. వరి కోతలు దాదాపుగా పూర్తికావస్తుండడంతో అధికారుల అంచనాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకపోవచ్చని భావిస్తున్నారు. మరో లక్ష టన్నుల ధాన్యం వస్తే ఎక్కువే అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

● 19,660 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం

ప్రభుత్వం సన్నరకాలకు ఈ సీజన్‌లో కూడా క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నది. ఇప్పటి వరకు 19,660 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయగా దీనికి 9.21 కోట్ల బోనస్ డబ్బు చెల్లించాల్సి ఉన్నది. ఈ డబ్బు చెల్లింపు కోసం ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరికోతలు పూర్తికావడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం పూర్తయింది. ఈ నెలాఖరు వరకు దాదాపుగా అన్ని కేంద్రాలకు ధాన్యం వస్తుందని, జూన్ మొదటి వారానికి కొనుగోళ్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

రెవెన్యూ సదస్సులో 90 దరఖాస్తులు



రాంచంద్రాపూర్ రెవెన్యూ సదస్సులో రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్

సైదాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్కేపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 90 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. వెన్కేపల్లి లో 67, రాంచంద్రాపూర్ గ్రామంలో 23 దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేస్తున్నామన్నారు. భూభారతి చట్టం నిబంధనల ప్రకారం సమస్యలు పరిష్కారిస్తామన్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన దరఖస్తులు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో దుద్దెనపల్లి, బొమ్మకల్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, డీటీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించామని సీఐ తెలిపారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులను విచారించారు.

నడకతో ఆరోగ్యం
● వాకింగ్‌తో పలు ప్రయోజనాలు
● నేడు వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే
7

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి అధికారి
● రూ.60వేలు తీసుకుంటుండగా పట్టివేత
6

విలీన గ్రామాల్లో 'ఉపాధి' కరువు

భగత్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాలు విలీనమవడంతో ఉపాధి హామీ పనులు కనుమరుగయ్యాయి. దీంతో చింతకుంట, మల్కాపూర్, మల్కాపూర్ అనుబంధ గ్రామమైన లక్ష్మీపూర్ గ్రామాల్లో ఉపాధిహామి కూలీపైనే ఆధారపడి ఉన్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలం లోని చింతకుంటలో 645 జాబ్‌కార్డులుండగా, 759 కూలీలున్నారు. 457 మంది జాబ్‌కార్డులు యాక్టివ్ గా ఉండగా, 513 మంది కూలీలు పనిచేసే వారు. మల్కాపూర్, లక్ష్మీపూర్‌లో 432 జాబ్‌కార్డులు ఉండగా, 547 మంది కూలీలు పనిచేస్తున్నారు. 342 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. 401 మంది కూలీలు రోజు వారీగా పనిచేసే వారు. వీరంతా ఉపాధి కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో ఉపాధి హామీ పథకాన్ని ఈ గ్రామాల్లో ప్రభుత్వం ఎత్తి వేశారు. ప్రభుత్వం ఈ గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలి ఉపాధి హామికూలీలు వేడుకుంటున్నారు.



చింతకుంటలో ఉపాధిహామీ పని చేస్తున్న కూలీలు (ఫైల్)

కూలీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలి

- భూక్యా తిరుపతినాయక్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ



చింతకుంట, మల్కాపూర్ గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనం కావడంతో ఉపాధి హామీ కూలీలు పనుల కోల్పోయారు. ఈ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి మున్సిపాలిటీలో పని కల్పించారు. ఉపాధి హామీ కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలి.

ఉపాధి కరువు..

- దేనవేని రజిత, ఉపాధి హామీ కూలీ



ఉపాధి హామీ పథకాన్ని చింతకుంటలో ప్రభుత్వం తీసి వేయడంతో మాకు ఉపాధి కరువైంది. ప్రభుత్వం, అధికారులు ఉపాధి హామి కూలీలకు పనులు కల్పించి తమను ఆదుకోవాలి.

పనులు కల్పించాలి

- గుడాల సరిత, ఉపాధి హామి కూలీ,చింతకుంట



ఉపాధి హామీ పథకాన్ని తీసి వేయడంతో పనులు కోల్పోయిన మాకు పనులు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి. గతంలో ఉపాధి హామీ కూలీపైనే ఆధారపడి జీవించే వాళ్లం. ఉపాధి హామీ పథకం తీసివేయడంతో పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు, ప్రభుత్వం కూలీ కల్పించాలి.

పని చేయని నిఘా నేత్రాలు

● గ్రామాల్లో అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు

రామడుగు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట, రామడుగు తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. ఎనిమిదేళ్ల క్రితం గోపాల్‌రావుపేటలో బస్టాండ్‌తోపాటు పలుచోట్ల అప్పటి సీపీ కమలాసన్ రెడ్డి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్ని నెలలకే అవి చెడిపోయాయి. అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. ఇటీవల మండల వ్యాప్తంగా దొంగతనాలు పెరిగిపోయాయి. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఎటువంటి ఆధారాలు లభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని మండలవాసులు కోరుతున్నారు.



గోపాల్‌రావుపేట బస్టాండ్ ప్రాంతం



గోపాల్‌రావుపేటలో పనిచేయని సీసీ కెమెరాలు

దొంగలు మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు...

- బండారి రాములు, గోపాల్‌రావుపేట



నా ఇంటి ఎదుటే సీసీ కెమెరా ఉన్నది. అయినా నా ఇంట్లో దొంగలు ప్రవేశించి మూడు తులాల బంగారం ఎత్తుకొని వెళ్లారు. ఇది జరిగి చాలా రోజులైనా బంగారం రికవరీ కాలేదు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. అధికారులు సీసీ కెమెరాలను బాగు చేయించాలి.

సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తాం...

- ప్రకాష్ గౌడ్, చొప్పదండి సీఐ

గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలను పునరుద్ధరించ డానికి చర్యలు తీసుకుంటాం. దొంగతనాలు అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

అద్దె భవనాల్లో పోలీస్ స్టేషన్లు

- తొమ్మిదేళ్లుగా సొంత భవనాలు లేక ఇబ్బందులు
- ప్రతిపాదనలకే పరిమితం

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత కమిషనరేట్‌లో ఏర్పాటైన కొత్త పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయి. కమిషనరేట్ ఏర్పడిన తర్వాత కొత్తపల్లి, ఇల్లందకుంట, గన్నేరువరం పోలీస్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ఈ మూడు పోలీసు స్టేషన్లు అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో తొమ్మిదేళ్లుగా కాలం వెళ్లదీస్తున్నాయి.



ఆయుర్వేద ఆసుపత్రి భవనంలో కొనసాగుతున్న గన్నేరువరం పోలీస్‌స్టేషన్ (ఫైల్)

● సమస్యలతో సతమతం

2016 అక్టోబరు 11న జిల్లాలో పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో కొత్తగా మూడు స్టేషన్లను ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటైన ఠాణాల ఎస్‌హెచ్‌వోలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అధికారాల అమలులో జాప్యం జరిగింది. ఆరు నెలలు ఎదురు చూసిన తరువాత రెండు ఠాణాల ఎస్ఐలకు ఎఫ్ఐఆర్ చేసే అధికారాలు దక్కాయి. జుడీషియల్ పరిధి విభజన, కోర్టు అనుమతుల కారణంగా కొత్త ఠాణాల ఎస్ఐలకు పూర్తిస్థాయి అధికారాలు కల్పనలో ఆలస్యం జరిగి ఆరు నెలలకు కొత్తపల్లి, గన్నేరువరం కొత్త ఠాణాలలో పూర్తి స్థాయి అధికారాలు వినయోగించుకునేందుకు ఎస్ఐలను నియమించారు. ఆ తరువాత కొంతకాలానికి ఇల్లందకుంట పోలీసు స్టేషన్ కూడా పూర్తిస్థాయి అధికారాలను కల్పించారు.

● కొత్తపల్లి పోలీస్ స్టేషన్

జిల్లాల విభజనకు పూర్వం కరీంనగర్ మండలంలో కరీంనగర్ టౌన్ మినహా 30 గ్రామాలుండగా 18 గ్రామాలతో కరీంనగర్ రూరల్, 12 గ్రామాలతో కొత్తపల్లి పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కొత్తపల్లి పోలీసు స్టేషన్‌ను చింతకుంటలో ఒక ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. కొత్తపల్లి ఠాణా కింద 12 గ్రామాలతోపాటు మరో 12 అనుబంధ గ్రామాలున్నాయి కొత్తపల్లితోపాటు ఆరెపల్లి, మల్కాపూర్, సీతారాంపూర్, బద్దిపెల్లి, బావుపేట, నాగులమల్యాల, ఖాజీపూర్, ఎలగందుల, కమాన్‌పూర్, చింతకుంట, పద్మనగర్ గ్రామపంచాయతీలున్నాయి. ప్రస్తుతం చింతకుంట గ్రామ పరిధిలోని ఒక ప్రైవేట్ భవనంలో కొత్తపల్లి పోలీసు ఠాణా కొనసాగుతున్నది. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.

● గన్నేరువరం పోలీస్ స్టేషన్

ఉమ్మడి జిల్లాలో ఉన్న బెజ్జంకి మండలంలో 29 గ్రామ పంచాయతిలు ఉండగా ఇందులో 16 గ్రామాలతో కూడిన బెజ్జంకి మండలం సిద్దిపేట జిల్లా పరిధిలోకి వెళ్లింది. దీంతో మిగతా 13 గ్రామాలతో కొత్తగా గన్నేరువరం మండల కేంద్రంగా ఏర్పాటయింది. ఆ తరువాత కొత్త గ్రామపంచాయతీలతో కలిపి ప్రస్తుతం 17 గ్రామాలతో గన్నేరువరం ఠాణాను స్థానికంగా ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ ఠాణా పరిధిలో గన్నేరువరం, చొక్కారావుపల్లి, పార్వెల్ల, ఖాసీంపేట, మైలారం, మాదాపూర్, హన్మాజిపల్లి, గోపాల్‌పూర్, జంగపల్లి, పీచుపల్లి, గునుకుల కొండాపూర్, చీమలకుంటపల్లి, గుండ్లపల్లి గ్రామాలు ఉన్నాయి. ఇటీవల పోలీసు స్టేషన్ కోసం గన్నేరువరం మండలకేంద్రంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ జువ్వాడి మన్‌మోహన్‌రావు స్థలాన్ని విరాళంగా అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.

● ఇల్లందకుంట పోలీస్ స్టేషన్

15 గ్రామాలతో కొత్తగా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మరో మూడు కొత్త గ్రామ పంచాయతీలతో మొత్తం 18 గ్రామాలు స్టేషన్ పరిధిలోకి వచ్చాయి. తొమ్మిది సంవత్సరాలుగా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ ప్రైవేట్ భవనంలోనే కొనసాగుతున్నది. నిత్యం ఫిర్యాదుదారులు, వివిధ సమస్యలను పరిష్కరించాలని బాధితులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మించి, అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి యువతి బలవన్మరణం


కవిత (ఫైల్)

ఇల్లందకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామానికి చెందిన మేకల కవిత(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఉన్నతచదువులు చదివి వలసఉద్యోగాలకు పోటీపరీక్షలు రాసింది. ఈక్రమంలో కుటుంబసభ్యులు అమ్మాయికి పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. ఐతే కవిత పెళ్లి సంబంధం చూశారు. కానీ కవిత ఇప్పట్లో నేను పెళ్లి చేసుకోను అని చెప్పింది. పెళ్లిపై ఇష్టం లేక గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీ ఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి తండ్రి మేకల సారయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబెషనరీ ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మిడిదొడ్డి వెంకటేష్(31) మతిస్థిమితం లేక మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా మతిస్థిమితం లేక మద్యానికి బానిసైనట్టు తెలిపారు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య మౌనిక ఉన్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి


మల్లేశం (ఫైల్)

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గన్నేరువరానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి న్నాత మల్లేశం(55) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందాడు. మల్లేశంకు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు మృతి


రాజుబాయి (ఫైల్)

రాయికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన మామిడి రాజుబాయి (85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందింది. రాజుబాయికి మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 6న కుటుంబసభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలి మనుమడు మామిడి సంజీవ్ ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా రాయికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో వృద్ధురాలు చనిపోయి కనిపించింది. మృతురాలు మతి స్థిమితం సరిగా లేనందున ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయి ఉండవచ్చునని మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయికల్ ఎస్సై సుధీర్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈత వనం దగ్ధం


దగ్ధమైన ఈత వనంలో గీత కార్మికులు

గంభీరావుపేట (ముస్తాబాద్), మే 9 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె గ్రామంలో గౌడ సంఘానికి చెందిన ఈతవనం దగ్ధమైంది. సమీప వ్యవసాయ పొలంలో కొయ్యకాళ్లను తగలబెడుతున్న క్రమంలో ఈతవనంకు మంటలు వ్యాపించడంతో దాదాపు 300 ఈత, తాటిచెట్లు దగ్ధమయ్యాయి. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు బైరి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బండి లక్ష్మణ్‌గౌడ్, నర్సాగౌడ్, అంజాగౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాములు గౌడ్ కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

వీర్నపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం లోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన పూడారి విజయ్ కుమార్ శుక్రవారం కమ్మునూర్ బ్రిడ్జి నుంచి వీర్నపల్లి వైపు వస్తుండగా కమ్మునూర్ చౌరస్తా వద్ద వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన గ్రామస్తులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

పసుపు సాగుకు జై..

- ఈ సీజన్‌లో జగిత్యాల జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగు అంచనా
- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- విత్తన పసుపునకు భలే డిమాండ్
- క్వింటాలుకు రూ.6 వేల చొప్పున విక్రయం

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పచ్చబంగారం సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలకరి రాగానే జూన్ మొదటి వారంలో పసుపు విత్తడం ఆరంభమవుతుంది. రైతులు ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఐదేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ రాగా ఈసారి మాత్రం పసుపు పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో గిట్టుబాటు ధర దక్కక సాగుకు దూరమైన వారు తిరిగి వేసేందుకు ఆలోచన చేస్తున్నారు. ఈ సీజన్‌లో అనూహ్యంగా రికార్డు స్థాయి ధరలు నమోదు కావడంతో పసుపు రైతుల్లో ఆశలు పెరిగింది. రైతులు ప్రస్తుతం విత్తనం సేకరించే పనుల్లో ఉన్నారు.

ఐదేళ్ల తర్వాత మార్పు

జగిత్యాల జిల్లాలో గడిచిన నాలుగు, ఐదు సంవత్సరాల్లో 35 వేల నుంచి 40 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. మద్దతు ధరలు అంతంత మాత్రం గానే ఉండడంతో గత సీజన్‌లో 25 వేల ఎకరాలకు పడి పోయింది. ప్రస్తుత సీజన్‌లో పసుపు ధర పుంజుకొని సరాసరి రూ.13 వేల నుంచి రూ. 20 వేల వరకు ధర పలికింది. కొమ్ముకే కాదు, మండ పసుపుకు కూడా డిమాండ్ రావడంతో రైతులను ఇటు వైపు మొగ్గు చూపేలా చేస్తోందని అధికారులు అంటున్నారు. పసుపుకు ఆశించిన ధర రావడం, పసుపు బోర్డు ఏర్పాటు కావడం తదితర కారణాల వల్ల ఈ ఏడాది గతంలో కంటే సాగు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో పసుపు సాగు అయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ, ఉద్యా నవన శాఖ వర్గాలు అంటున్నాయి.





చిగురిస్తున్న ఆశలు

పసుపు రైతులకు ఈ ఏడాది వరస నష్టాల నుంచి ఉపశమనం లభించింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కడంతో చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. రైతుల్లో సాగుపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఈసారి సాగు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో విత్తన పసుపునకు డిమాండ్ ఏర్పడింది. గతేడాది క్వింటాకు రూ. 4 వేలు ఉన్న విత్తన పసుపు ధర ఇప్పుడు రూ.6 వేల పలుకుతోంది. కొను గోలుకు పసుపు రైతుల్లో ఆసక్తి ఉన్నా విత్తనం దొరకడం లేదు.

పసుపు సాగు పెరుగుతోంది

సోమ శ్రీనివాస్, పసుపు రైతు, గోదూరు గ్రామం, జగిత్యాల



ప్రస్తుత సీజన్‌లో పసుపు సాగు పెరగనుంది. పసుపుకు మార్కెట్‌లో అధిక ధరలు రావడం, పసు పు బోర్డు ఏర్పాటు తదితర అంశాలు పసుపు సాగు పెరగడానికి కారణంగా మారింది. పలువురు రైతులు పసుపు సాగు చేయడానికి మొగ్గు చూపుతు న్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్య పల్లి మూల మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన శ్రీతుపేవుల శ్రావణ్ తన సోదరుడు శశిధర్ కలిసి భూపాలపల్లి జిల్లా జంగ పల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి-మంథని ప్రధాన రహదారి రంగయ్యపల్లి మూలమలుపు వద్ద ఉన్న చెట్టును ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శ్రావణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. శశిధర్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా గాయపడ్డ వారిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రయాణికురాలిపై కోతుల దాడి

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓప్రయాణికురాలిపై కోతులు దాడిచేయ డంతో తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెంకు చెందిన బండి ప్రవంతి రైల్వే స్టేషన్‌లోని కౌంటర్‌వద్దకు టికెట్ కోసం వెళుతున్న క్రమంలో కోతులు అకస్మాత్తుగా దాడిచేసి నోటకరిచాయి. దీంతో మహిళ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. పొత్కపల్లికి చెందిన బంధువు గూడెపు సంజీవరెడ్డి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో కోతులు దాడిచేశాయి. రైల్వేస్టేషన్‌లో సమయానికి పోటుచేసుకుంది. గాయాలకు గురైన మహిళను జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు


గాయపడ్డ రైతు కొమురయ్య

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికిచెందిన రైతు జీల కొమురయ్య(48) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు పోవడంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. త్వరగా ఫ్యూజువేసి విద్యుత్‌సరఫరా పున రుద్ధరించ తనపొలానికి నీరు అందించాలని బావించి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కొమురయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ రైతును బారతీయ కిసాన్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖకు సంబంధించిన హెల్పర్ స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించడాని ఆరోపించారు. హెల్పర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రైతు మార మృతుడయ్యే క్రమంలో విద్యుత్ గురయ్యాడన్నారు. ఈసంఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లపై మున్సిపల్ అధికారుల దాడులు

- రూ.18 వేల జరిమానా

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని పలురెస్టారెంట్లు, బేకరీ, టిఫిన్‌సెంటర్లు, హోటళ్లు, ప్లాస్టిక్ దుకాణాలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. తినుబండారాలను, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.18,000జరిమానాలు విధించారు. ఈ సందర్భంగామున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ట్రేడ్‌లైసెన్స్ లేనివారు వెంటనే తీసుకోవాలని సూచించారు. తడిపొడి, హానికర మైన చెత్తగా వేరుచేసి దుకాణాలకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని లేనిచో జరిమానాలను విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలేశ్వర్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌మహేష్, సిబ్బంది హేమంత్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగుట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్టు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదుచేశామని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు తెలిపారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో తొలగించిన కాంట్రాక్టుకార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికులసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. టౌన్‌షిప్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 100 మంది కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లక్క శంకర్ మాట్లాడుతూ ఇటీవల టౌన్‌షిప్‌లోని వివిధ జోన్లకు సంబంధించి టెండర్లలో మ్యాన్ పవర్‌ను తగ్గించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో కార్మికులు ఆయోమయంలో పడ్డారన్నారు. కొత్త టెండర్లలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కొంత మంది కార్మికులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఇచ్చిన ఆదేశాల మేరకు 60 సంవత్సరాలు దాటిన కార్మికుల పిల్లలకు డిపెండెంటు ఎంప్లాయ్‌మెంట్ కింద పనులు కల్పించిందని, దీంతో చాలామంది కార్మికులు తమ వారసులను తమస్థానాల్లో ఉద్యోగాలు కల్పించారన్నారు. కొత్త టెండర్లలో డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ కింద చేరిన వారిని చేర్చలేదన్నారు. దీనివల్ల కార్మికులను తొలగించేందుకు సదరు కాంట్రాక్టర్లు సిద్ధయయ్యారన్నారు. ఇప్పటికే కొంతమంది కార్మికులను విధుల నుంచి తొలగించారని తెలిపారు. కొత్త టెండర్లతోపాటు పాత టెండరులో ఉన్న అందరు కార్మికులను చేర్చి కార్మికులకు న్యాయం చేయాలని శంకర్ డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం నుంచి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తాము టౌన్‌షిప్‌లో విధులుబహిష్కరిస్తే ఎన్టీపీసీ యాజమాన్యమే బాధ్యత వహించాలని, తప్పని పరిస్థితుల్లో తాము విధులు బహిష్కరించాల్సి వస్తున్నదన్నారు. 2022లో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ప్రకారం 1,020 రూపాయల అలవెన్సులను కార్మికులకు చెల్లించడం లేదని, 16 నెలల ఏరియర్స్‌ను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లోని నాలుగు జోన్లను కట్ చేసి ఎ రాజేశం అనే కాంట్రాక్టరుకు పనులను అప్పగించారన్నారు. ఈ విషయంలో యాజమాన్యం స్పందించి చర్యలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, స్వామి, రవి, కృష్ణ, మొండయ్య, ఓదెలు, నర్సయ్య, రమేష్, శంకర్, చిరంజీవి, రాయమల్లమ్మ, సూరమ్మ, ఓదెమ్మ, హైమావతి, పద్మ, స్వరూప, సంధ్య సరోజన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

చేలలో భూసారం పెరుగుదలకు దోహదం..

చొప్పదండి, మే 9 (ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి పంట చేలకు ఎంతో మేలు చేస్తుంది. ఎరువులలో చెరువు మట్టి పోస్తే చేనుకు పుష్టి చేకూరుతుంది. ఎండాకాలంలో నీరంతా ఇంకి పోయి చెరువు ఎండిపోగానే పూడికతీత పనులను ప్రారంభిస్తారు. ఆ మట్టిని రైతులు తమ పొలాల్లో పోసుకుంటున్నారు. రైతులు తమ పంట చేనులో చెరువుమట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పుడు అనేక పోషకవిలువలు కలిగిన సారవంత మైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువుల్లో పూడిక పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చెరువు మట్టి ప్రాముఖ్యత వివరాలు.

చెరువు మట్టితో ప్రయోజనాలు..

- చెరువు మట్టితో రైతుల పంట దిగుబడి పెరుగుతుంది.
- చెరువు మట్టిని చేనులో పోయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలను తటస్థంగా మారతాయి.
- నేలలోని లవణాల మోతాదు తగ్గుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తి నేలకు కలుగుతుంది.
- దిగుబడి పెరిగి రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నేల సారవంతంగా మారుతుంది.
- చెరువులో పూడిక మట్టి తరలింపుతో వర్షాకాలంలో నీటినిల్వలు పెరుగుతాయి. తద్వారా గ్రామంలో భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది.


చేనులో చెరువు మట్టి

లారీ డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కరీంనగర్ క్రైం, మే 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. లారీని వేగంగా నడుపుతూ నో ఎంట్రీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని గుర్తించిన పోలీసులు బ్రీత్‌ఎనలైజర్‌తో డ్రైవర్‌ను పరీక్షించారు. మోతాదుకు మించి అత్యధికంగా 100 ఎంఎల్ రక్తంలో 550 మిల్లీ గ్రాముల ఆల్కాహాల్ ఉన్నట్టు వెల్లడైంది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు, లారీని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో సీఐ పర్శ రమేష్, ఎస్ఐ ఇషాక్ అహ్మద్ పాల్గొన్నారు.

రూ.7410 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7410 పలికింది. నలుగురు రైతులు 36క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ట ధర రూ.7410, కనిష్ట ధర రూ.6950 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి అధికారి

- రూ.60వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి


ఏసీబీకి పట్టుబడిన ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలో అవినీతి అధికారి కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ పోలీసు అధికారుల వలలో పట్టుబడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న ఎర్రవల్లి అమరేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.60వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పోలీసులకు పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని డివిజన్-7 అపూనార్, అగ్రహారం గ్రామంలో చెక్‌డ్యాం నిర్మాణంకు సంబంధించిన రూ.50లక్షల బిల్లు ఎంబీరికార్డు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఈఈ ఎర్రవల్లి అమరేందర్‌రెడ్డి కొద్దిరోజులుగా లంచం డబ్బుల కోసం వేధిస్తున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ పోలీసులను ఆశ్రయించాడు. రూ.50లక్షల బిల్లుమంజూరు కోసం లక్ష రూపాయలు డిమాండ్ చేయగా చివరకు 75వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. లంచం డబ్బులు ఇంటివద్ద ఇవ్వాలని చెప్పగా ఏసీబీ పోలీసులు సూచన మేరకు రాత్రి 8గంటల ప్రాంతంలో లంచం డబ్బులు రూ.60వేలు కరీంనగర్ విద్యారణ్యపురిలో ఈఈ అమరేందర్ రెడ్డి ఇంటివద్ద ఇస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ వీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు మాటువేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే చెక్‌డ్యాం నిర్మాణానికి సంబంధించి రూ.5కోట్ల రూపాయల బిల్లురికార్డు చేసేందుకు ఈఈ ఇంతకుముందు4లక్షల రూపాయలు బాధితుడి నుంచి తీసుకున్నాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లంచంకు సంబంధించిన రూ.60 వేల నగదును సీజ్‌చేశారు. నిందితుడు ఈఈ అమరేందర్‌రెడ్డిని అరెస్టుచేసిన ఏసీబీ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. శనివారం కరీంనగర్ ఏసీబీకోర్టులో ఆతడిని హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

లంబడితండా(బి)లో ఎక్సైజ్ దాడులు


పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

ధర్మారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబడితండా(బి) గ్రామంలో ఎక్సైజ్ శాఖ-డిస్ట్రిక్ట్‌టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్టు ధర్మారం ఎక్సైజ్ ఎస్ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పావనితోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైనా నాటుసారా, గుడుంబా తయారుచేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పావని హెచ్చరించారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ గురుకుల ఆర్‌ఎల్‌సీ కనకర్ల సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అన్సాం మసీద్ దగ్గర ఇరుకుల్ల మైనార్టీగురుకుల పాఠశాలలో కల్పిస్తున్నసౌకర్యాలపై ఉపాధ్యాయ బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అల్పసంఖ్యాకులు అందరికీ సమానంగా ఎదగాలని గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కో-ఆర్డినేటర్ మహేందర్, కాలేజ్ కో-ఆర్డినేటర్ రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగల బీభత్సం

- రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలో తాళం వేసి ఉన్న వొద్దిరాల శ్రీనివాస్ ఇంటిలో చొరబడిన దొంగలు వస్తువులు చోరబడ్డారు. బీరువా, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. ఇంటిలో దాచుకున్న రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. శ్రీనివాస్, తన భార్య ఇద్దరు బస్టాండ్ ప్రాంతంలో టిఫిన్ పాయింట్ హోటల్ పెట్టుకుని జీవిస్తున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పట్టపగలే చోరీకి పాల్పడడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎన్టీపీసీ ప్లాంటులో విపత్తు జరిగితే ఎదుర్కొంటాం

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా


మాక్ డ్రిల్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంటులో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతీ క్షణం అధికార యంత్రాంగం, సిబ్బంది సన్నద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో భద్రతా సిబ్బందితో సీపీ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని దుస్సంఘటన జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం, అగ్ని ప్రమాదాలు జరినప్పుడు భద్రతా దళాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాను

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న క్రమంలో ఏదైనా విపత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, ప్రాజెక్టు పరిసరాల్లో, పని స్థలాల్లో తనిఖీలు తదితర అంశాలను మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. సీఐఎస్ఎఫ్ రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ అంజనేయరాజు, డిప్యూటీ కమాండెంట్ ఓవికె శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన మాక్ డ్రిల్‌లో అసిస్టెంట్ కమాండెంట్లు జై కన్వర్, ఆకేశ్వర్‌సింగ్, ఇన్‌స్పెక్టర్లు, జవానులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ

- చారిత్రక, పురాణాల ప్రాశస్త్యానికి ఇబ్బంది లేకుండా అభివృద్ధి
- మొదటి విడత రూ.76.73 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- భీమన్న ఆలయంలోనే భక్తులకు దైవ దర్శనాలు
- ప్రధాన గర్భాలయం ముట్టకుండా అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరు

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ పట్టనుంది. స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాజన్న ఆలయ అభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశ పనులను జూన్ మాసం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయించారు. జూన్15వ తేదీ నుంచి రాజన్న ప్రధాన దేవాలయంలోకి భక్తులను అనుమతించరు. నిత్యపూజలను మాత్రం అర్చకులు ప్రధాన దేవాలయ గర్భాలయంలో నిర్వహిస్తారు.

భక్తులకు దైవ దర్శనాన్ని స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శించుకు నేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శృంగేరి పీఠాధిపతి సూచించిన మార్పులను పరిగణలోకి తీసుకుని చారిత్రక, పురాణాల నేపథ్యం ఉన్న భాగాలను, పురాతన గ్రంథాలు, పూర్వం రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధిని విస్తరించేందుకు ముందుకు సాగుతున్నారు. పురాణ నేపథ్యం కలిగిన ధర్మగుండం, గుడి చెరువు ప్రాశస్త్యం తగ్గకుండా 40ఎకరాల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అన్నదాన సత్రం, క్యూ కాంప్లెక్స్‌లు, వసతిగృహాలు, రెండు ప్రాకారాలు, కార్యాలయం, కోనేరు, కల్యాణకట్ట, కోడె మొక్కుల ప్రాంతం వంటి వాటిని కొత్తగా నిర్మించనున్నారు. ఇందకు మూడు దశల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.550 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆలయ విస్తరణకు రూ.76 కోట్లు, కల్యాణ మండపానికి రూ.33 కోట్లు, రోడ్ల విస్తరణ పనులకు రూ.47.86 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇటీవల బడ్జెట్‌లో మరో రూ.100కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది.


వేములవాడ రాజన్న ప్రధాన ఆలయ ఊహాచిత్రం

1979లో ఆలయ పునరుద్ధరణ..

వేములవాడ రాజన్న ఆలయ పునరుద్ధరణ 1979లో చేపట్టారు. ఆలయ సంప్రదాయ నిర్మాణ ఆధారంగా అప్పట్లో గర్భగుడి ద్వారాలు, రాజగోపురాలను ఆధునిక శైలిలో మరమ్మతులు చేసి ఆధునికీకరించారు. ధర్మగుండం, ఆలయ ప్రాంగ ణంలో ఉన్న పరివార దేవాలయాలు, కోటిలింగా లను ప్రత్యేక ఆకర్షణగా నిర్మించారు. కాగా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రస్తుతం ఆలయ అభివృద్ధి ఉండనుంది. పురాతన శిల్పకళ, శైవ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయాన్ని విస్తరించనున్నారు. రాజన్న ఆలయాన్ని సౌందర్యానికి ప్రతిరూపంగా రూపుదిద్దేలా ప్రణాళికలు చేస్తున్నారు. ధర్మగుండం మధ్యలో శివుడి విగ్రహం, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడం కోసం ధర్మగుండం చుట్టూ పార్క్, నడక మార్గాలతో పాటు ఆకట్టుకునే డిజైన్‌లను తయారు చేస్తున్నారు.



శృంగేరి శంకరమఠం పీఠాధిపతి సూచనలతోనే..

చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న భాగాలను, పురాణాలు, పురాతన గ్రంథాల, 1970లో వెలుగుచూసిన రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఆలయ అభివృద్ధిని చేసేందుకు నిర్ణయించారు. ఆలయ విస్తరణ పనుల్లో వేములవాడ చాళుక్యుల శైలి మూర్తీ భవించేలా నిర్మాణం జరగనుంది.

తెలంగాణలో ఎంతో గొప్పగా నిర్వహించే బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజులు జరుపుకుంటే వేములవాడలో మాత్రం 7 రోజులు నిర్వహిస్తారు. బతుకమ్మ పుష్పం నుంచే ఆలయం ఉద్భవించిందన్న పౌరాణికగాథ అనుగుణంగా బతుకమ్మ గుర్తులు ప్రతిబింబించేలా నిర్మాణం చేపట్టనున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో గతంలో ఆలయ పునరుద్ధరణ వంకరగా జరిగిందని, ప్రస్తుత విస్తరణ పనుల్లో రెండు ప్రాకా రాలు, రెండు వీధులతో క్రమ పద్ధతిలోకి మార్చనున్నారు. నాలుగు ఎకరాల్లో ఉన్న ఆలయాన్ని 4.6 ఎకరాలకు పెంచనున్నారు.


గుడి చెరువు అభివృద్ధి ఊహాచిత్రాలు


భీమేశ్వర స్వామి ఆలయం

చరిత్రలో నిలిచేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దక్షిణభారత దేశంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా వేములవాడ రాజన్న ఆలయం కొనసాగుతోంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలనేది నా చిరకాల వాంఛ. దాని కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా ఉండగా ఆలయ అభివృద్ధి జరగడం ఎంతో సంతోషంగా ఉంది. వచ్చే వెయ్యి ఏళ్ల గుర్తుండేలా ఆలయ విస్తరణ చేయాలని అనుకుంటున్నాము. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితోపాటుగా ఎనిమిది మంది మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాలను చేసుకున్నాము. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దైవ దైర్శనం కల్పిస్తాము. ఎంతో చారిత్రక, పురాణ నేపథ్యం కలిగి ఉన్న విభాగాలను ముట్టకుండా శృంగేరి శంకరమఠం పీఠాధిపతుల సూచనలు, సలహాల మేరకే ఆలయ విస్తరణ పనులను చేపడుతున్నాము.

పవర్ లిఫ్టింగ్‌లో సిరిచందనకు కాంస్యం


సాధించిన పతకం ప్రశంస పత్రంతో సిరిచందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన తుడి సిరిచందన కాంస్య పతకం సాధించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించిన ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గంగాధర మండలం మర్రిగడ్డకు చెందిన సిరిచందన 52 కేజీల విభాగంలో 330 కిలోల బరువును ఎత్తి కాంస్యం సాధించింది. గత డిసెంబరు 16 నుంచి 19 వరకు ఢిల్లీ సర్దార్ సింగ్ స్టేడియంలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ ఇండియా ఫెడరేషన్ కప్ జాతీయ చాంపియన్‌షిప్‌లో 330 కిలోల బరువు ఎత్తి రజతం సాధించింది. దీంతో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భారత జట్టు తరఫున ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, పవర్ లిఫ్టింగ్ కోచ్ భీమనాతిని మల్లేశం అభినందించారు.


ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల వేదికపై సిరిచందన

మానసాదేవి ఆలయంలో కొనసాగుతున్న వార్షికోత్సవం

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తమ వార్షిక వేడుకలు రెండోరోజు శుక్ర వారం కొనసాగాయి. ఈ వేడుకల్లో ఉదయం చండీ హోమం, 108మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, మానసాదేవికి లక్ష పుష్పార్చన, మహేశ్వరునికి భస్మాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించి అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, పులి కృష్ణ, అలువాల కోటి, బద్దం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.


మానసాదేవి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- వాకింగ్‌తో పలు ప్రయోజనాలు
- నేడు వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే

నడకతో ఆరోగ్యం



కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జీవన విధానంలో ప్రజలకు తగిన వ్యాయామం లేక శరీరంపై నియంత్రణ లేకుండాపోతోంది. ప్రజలు బీపీ, షుగర్, స్థూల కాయంతో పడుతున్నారు. ప్రతి రోజు కనీసం 45 నిమిషాలు నడవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. నడకను తమ జీవితంలో భాగంగా చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం మైదానాలు, ఖాళీ స్థలాలు, రహదారుల వెంట చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా వాకింగ్ చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

● **ఉపయోగాలు:** నడక మన శరీర నిర్మాణాన్ని మార్చుతుంది. నడకతో చాలా రకాల ఉపయోగాలున్నాయి. గుండెజబ్బులు, మధుమేహం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, స్థూలకాయం రాకుండా చూస్తుంది. శరీరంలోని కొవ్వును తగ్గించి జీవిత కాలాన్ని పెంచుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా యువత, పెద్దలు నడకను జీవితంలో ఒక భాగంగా చేసుకుంటున్నారు. ప్రత్యేకించి ఇటీవలి కాలంలో 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారు, వృద్ధులు ఆసక్తి చూపుతున్నారు.

● **నేపథ్యం:** నడక ప్రాధాన్యాన్ని గుర్తిం చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2002 మే 10న నిర్వహించిన సమావేశంలో వ్యాయామం, ఆరోగ్యం, ఆహారం అంశాల మీద చర్చించింది. ఆహార నియమాలతో పాటు నడక వ్యాయామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 10న వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే జరుపుకోవాలని సూచించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మే10న నడక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

వాకింగ్ ప్రారంభం ఇలా...

- వాకింగ్ ప్రారంభించే వారు మొదటి రోజు 5 నుంచి 15 నిమిషాలు నడిచి క్రమేపి సమయాన్ని పెంచాలి.
- షూస్ తప్పని సరిగా ధరించాలి.



- వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మంచిది.
- రహదారులపై వాకింగ్ చేయడం కంటే మైదానాలలోనే వాకింగ్ చేయడం మంచిది.

వాకింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నడిచేటప్పుడు చేతులు ఊపుతూ శరీరాన్ని నిటారుగా ఉంచాలి.
- వాకింగ్ ఆపే ముందు వేగాన్ని క్రమేపి తగ్గించాలి.
- నడిచేటప్పుడు వదులుగా ఉండే దుస్తులనే ధరించాలి.
- ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్ సలహాతో వాకింగ్ చేయాలి.
- ప్రతి రోజు 45 నిమిషాలు నడిస్తే మంచింది.
- పక్కవారితో సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా ఉండాలి.
- నడిచేట ప్పుడు శ్వాసపై నియంత్రణ అవసరం.





నూతనోత్సాహం కలుగుతుంది..: ఎడ్ల మధు, వాకర్

వాకింగ్‌తో చేస్తే ఉత్సాహంగా ఉంటుంది. నడవని రోజు అసౌకర్యంగా ఉంటుంది. ఉదయమే ఏకాగ్రతతో నడవటం వల్ల ఇతర ఆలోచనలు దరి చేరవు. 10 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను.

బీపీ, షుగర్ నార్మల్‌గా ఉంటాయి.. :ఎంఏ కరీం, వాకర్



ఎనిమిదేళ్లుగా ప్రతి రోజు వాకింగ్ చేస్తున్నాను. గతంలో కాళ్లు, కీళ్లనొప్పులుండేవి. ప్రస్తుతం అవేమి లేవు. అనారోగ్య ఇబ్బందులు లేవు. షుగర్, బీపీ నార్మల్‌గా ఉన్నాయి.

ధర్మపురిలో వైభవంగా అన్నకూటోత్సవం

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్తహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠపైకి తీసుక వచ్చి ఆశీనులు చేశారు. అనంతరం పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు


నివేదన కోసం తీసుకు వెళుతున్న అర్చకులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

నిలిచిన పంచాయతీ భవన నిర్మాణాలు

- పాత భవనాల్లో కార్యకలాపాలు
- కొత్త భవనాలకు మోక్షమెప్పుడో?




జూబ్లీనగర్, ఇరుకుల్లలో నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణాలు

కరీంనగర్ రూరల్, మే 9: పాలన ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఆరేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఆరంభంలో పంచాయతీ కార్యాలయాలను ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, అద్దె గృహాల్లో నిర్వహించారు. పాలవకర్గాలు, అధికారుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం జనవరిలో కరీంనగర్ మండలంలో కొత్తగా ఏడు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో భవనానికి 20లక్షల రూపాయలు కేటాయించింది. సర్పంచులు తమ పదవీ కాలంలోనే పూర్తి చేయాలని సంకల్పించినా నిధుల విడుదల జాప్యమవుతుందనే కారణంతో ముందుకు రాలేదు. అధికారుల ఒత్తిడితో కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టినా అర్ధంతరంగా నిలిపివేశారు. చేసిన పనులకు కూడా నిధులు రాలేదని వాపోతున్నారు. పలు భవనాలు చివరి దశకు చేరుకున్న నిధులు సరిపోక పనులను నిలిపివేశారు. గోపాల్‌పూర్‌లో భవన నిర్మాణాన్ని ప్రారంభించలేదు. జూబ్లీనగర్‌లో పిల్లర్ల కోసం సలాక వేసి వదిలేశారు. పనులు పునాది దశలోనే నిలిచిపోయాయి. ఇరుకుల్లలో స్లాబ్ వేశారు. దుబ్బపల్లి, మందులపల్లి గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తి కాగా చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. పంచా యతీ కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. వరుసగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు రావడంతోపాటు బిల్లులు మంజూరు కాకపోవడంతో భవనాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

వివాదాస్పదంగా బొమ్మకల్ పంచాయతీ భవనం

కరంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన బొమ్మకల్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం వివాదాస్పదంగా మారడంతో పనులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయని సర్వే నంబరు 17బైఏలోని ప్రైవేటు స్థలంలో సుమారు రూ.80లక్షల అంచనా వ్యయంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి అనచరుడు భవన నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు పూర్తి కాకుండానే గతంలో అప్పటి సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ అధికారికంగా ప్రారంభించారు. ప్రైవేటు స్థలంలో పంచాయతీ భవన నిర్మాణంపై మాజీ వార్డు సభ్యుడు తోట కిరణ్ కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. దీంతో భవన నిర్మాణం వివాదాస్పదంగా మారి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మరో వైపు పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యాలయాన్ని ప్రైవేటు భవనంలోకి మార్చి కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు.

ప్రారంభమైన క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కరీంనగర్ కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెయింట్ మార్క్స్ చర్చి గ్రౌండ్‌లో స్థానిక సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు ప్రారంభమయ్యాయి. వైజాగ్‌కు చెందిన జాతీయ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ప్రవచకుడు డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రసంగించారు. ఏసు క్రీస్తు మానవీయ విలువలు, గుణగణాలు మానవ జీవితాలకు ఎలా అన్వయింపజేసుకోవాలో, ఆచరించాలో వివరించారు. కార్యక్రమంలో సి.రాములు, ఇమ్మానుయేలు, ఎస్.జాన్, పాల్ కొమ్మాలు, ఆర్.ప్రసాద్, బి.ప్రసాద్, ఎ.మధుమోహన్, పింటు, రోజి, ఎస్ సత్యానందం, రెనాల్డ్, నారాయణ, మాణిక్యరావు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సూరేపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి, గవర్నర్‌కు బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను అగౌరపరిచే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టడంపై మండిపడ్డారు.

గణేశ్‌నగర్: ఆపరేషన్ సిందూర్‌పై దేశాన్ని కించపరిచే విధంగా, సైనికుల సాహసాన్ని ఎగతాళి చేసే విధంగా పోస్ట్ పెట్టిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు సురేపల్లి సుజాతపై వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్య వ్యవస్థలో ఉంటూ ద్వేషాన్ని నూరిపోస్తున్నారని, పదవి నుంచి తొలగించాలని అన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు

కరీంనగర్ క్రైం, మే 9 : పోలీసుశాఖలో హెడ్‌కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న పలువురికి ఏఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. కాళేశ్వరం జోన్ పరిధిలో 11 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ ఇంటిలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉండింటి శ్రీనివాస్ ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఆయనకు కరీంనగర్ ఇంటిలిజెన్స్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు. డీఎస్పీ గౌస్‌బాబా, సదానందం ఏఎస్సై పదోన్నతి స్టార్‌ను అందజేశారు.

సమ్మె నోటీసులు అందజేత

భగత్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా షాపింగ్ మాళ్ల కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో షాపింగ్ యాజమాన్యాలకు సమ్మెనోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య, నాయకులు తిరుమలయ్య, ముల్కల శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

భగత్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మొదటి లబ్ధిదారుడిగా ఎంపికైన తనకు రోజుకోరకమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఉన్నతాధి కారులు న్యాయం చేయాలని బద్దిపల్లికి చెందిన దూలం శారద రాజమౌళి వేడుకున్నాడు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బద్దిపల్లిని పైలెట్ గ్రామంగా తీసుకున్న ప్రభుత్వం మొదటి లబ్ధిదారుడిగా రాజమౌళిని ఎంపిక చేసింది. దీంతో ఇంటి నిర్మాణం కోసం భూమిని కొనుగోలు చేశాడు. మొదటి విడతలో బెస్‌మెంట్ లెవల్ వరకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందించింది. ఇంటికి రోడ్డు లేదని అడ్డంగా కొంతమంది మట్టి కుప్పలు పోశారు. కొంత నిర్మాణం చేపట్టాక దారి లేదని తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితుడు ఆవేదన చెందుతున్నాడు.

కేడీసీసీ బ్యాంక్ సీఈవోకు శుభాకాంక్షలు

సుభాష్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): మహిళల స్వయం సహాయ బృందాల ఉత్తమ పనితీరుకు కేడీసీసీ బ్యాంకు సీఈవోకు సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులకు ఐ ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, మే 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని తెలంగాణ అమర వీల స్తూపం వద్ద రోడ్డుపై శుక్రవారం ఐ ఫోన్ కిందపడి ఉండగా ఐద తిరుపతి అనే ఆటో డ్రైవర్ కరీంనగర్ వన్ టౌన్ పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. ఐఫోన్‌కు సంబంధించిన యజమాని సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో స్టేషన్‌కు వచ్చి ఫోన్‌ను తీసుకెళ్లాలని ఎస్సై రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆటటో డ్రైవర్ తిరుపతిని ఎస్సై అభినందించారు. ఆటో యూనియన్ సంఘం అధ్యక్షుడు రాజేందర్ ఉన్నారు.

● న్యూస్ బాక్స్

ఎలగందల్‌లో బడిబాట

భగత్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన, కంప్యూటర్ శిక్షణ, క్రీడా పోటీల నిర్వహణ తదితర అంశాలపై తల్లి దండ్రులకు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు సంతాపం

కరీంనగర్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో భాగంగా జమ్మూ కశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ మృతికి టీడీపీ పార్లమెంట్ నియో జకవర్గ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. జవాన్ మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

సుభాష్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలని తెలంగాణ మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో ముఖ్యనాయకులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు సబ్సిడీ రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ తప్పనిసరి నిబంధనతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు.

అల్ఫోర్స్ డిగ్రీ విద్యార్థినులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్



అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు మెడికో హెల్త్ కేర్ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికయ్యారు. శుక్రవారం కళాశాలలో ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు ట్రైనీ ఇన్ రెవెన్యూ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ అసోసియేట్స్‌గా ఎంపికవడానికి వివిధరకాల నైపుణ్య కార్యక్రమాలు ఉపయోగపడినట్లు చెప్పారు. కళాశాలలో అన్ని రకాల ఉద్యోగాలకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్ర్యమంలో పిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, టీపీవో, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈలు లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యారణ్యపురి, సరస్వతీనగర్, మణికేశ్వర్ నగర్, ఉదయం 8:30 నుంచి 10 వరకు శక్తి ఆలయం, బాలాజీ సూపర్ మార్కెట్, సంతోష్ నగర్, భాగ్యనగర్, జ్యోతి నగర్, గీతాభవన్ వెనక వైపు ఏరియా, కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాత హనుమాన్ దేవాలయం, కొత్త లేబర్ అడ్డా, సాయిబాబా దేవాలయం, విద్యానగర్, విజయదుర్గా కాలనీ, హిందూ పురి కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల, చైతన్యపురి, ఉదయం 8:30 నుంచి 10:30 వరకు కశ్మీర్‌గడ్డ, తెలంగాణ చౌక్, ముఖరంపుర, గోదాం గడ్డ, భగత్‌నగర్, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రామచంద్రపురి కాలనీ, శివనగర్, ఏటస్ కాలనీ, ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు రేకుర్తి, కొత్తపల్లి మునిసి పాలిటీ, కిమ్స్ కళాశాల, ఢిల్లీ రక్షణ కళాశాల, జగిత్యాల రోడ్డు, సీతారాంపూర్, రేకుర్తి చౌరస్తా, ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు బద్దిపల్లి, నాగుల మల్యాల్, కమాన్‌పూర్ గ్రానైట్ పరిశ్రమలు, మగ్దుంపూర్, ఇరుకుల్లా, నల్లగుంటపల్లి, చెర్లబూత్కూర్, తాహెర్ కొండాపూర్, దుబ్బపల్లి, ఫకీర్‌పేట్, చామనపల్లి, జూబ్లీనగర్, బహదూర్ ఖాన్‌పేట్, ఎలబోతారంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలి

సుభాష్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల అంతమే కాదు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధంగా చూడరాదని, ధర్మ పోరాటంగా చూడాలని అన్నారు. భారత్ ఎంతో శాంతిగా ఉండాలని చూసినా పాకిస్తాన్ ఐఎస్ఐ ఇస్లామిక్ ప్రేరేపిత టెర్రరిజంతో అమాయకుల ప్రాణాలను బలిగొనడం ఘోరామైన చర్యగా బావించామని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు వెంకటేష్, మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి విద్యాశాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

వీధి దీపాల సమస్యపై దృష్టిసారించాలి

● మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల సమస్యపై దృష్టిసారించాలని, ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరవ్యాప్తంగా సెంటర్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు అన్ని లైట్లు ప్రతీరోజు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ లెవల్‌లో లైట్లను తనిఖీ చేయాలని, సమస్య ఉంటే మరమ్మతు చేపట్టాలని సూచించారు. నగరపాలక సంస్థకు చెందిన ఎస్‌టీపీ ఆధునికీకరణకు ప్రభుత్వం నుంచి సాంక్షన్ ఇచ్చినట్లు చెప్పారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నల్లా పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా నగరంలో చేపట్టి ప్రారంభించిన డిజిటల్ లైబ్రరీ, కశ్మీర్‌గడ్డ రైతు బజార్, బాలసదన్ భవన్, ఐసీసీసీ తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈలు యాదగిరి, సంజీవ్, డీఈ లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాశ్, శ్రీనివాస్‌రావు, ఏఈ సతీష్ కుమార్, గట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేశారు.. హద్దురాళ్లు నిర్ణయించడం మరిచారు..



నిరసన తెలుపుతున్న టీజేఎస్, టీడీపీ నాయకులు

శంకరపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని మొలంగూర్‌లో 703 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ పోరంబోకు భూమిని రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు.. కానీ హద్దులు నిర్ణయించి హద్దురాళ్లు పాతడం మరిచారని మోరె గణేష్, తదితరులు ఆరోపించారు. గతంలో మోరె గణేష్ ఆధ్వర్యంలో మొలంగూర్ గ్రామస్థులు గ్రామంలోని సర్వే నంబర్ 703 ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి గూడు లేని పేదలకు ఇవ్వాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ మేరకు హద్దులు నిర్ణయించి హద్దురాళ్లు ఏర్పాటు చేయకపోవడంతో సమస్య అక్కడే ఉందని ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద టీజేఎస్, టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రెవెన్యూఅధికారులు ఈనెల20లోపు సర్వేచేసి హద్దురాళ్లను పాతుకోవడం కోసం హద్దులను నిర్ణయించాలన్నారు. లేనిపక్షంలో ఈ నెల20న దీక్షకు పునుకుంటామన్నారు. కార్యక్రమంలో టీజేఎస్, టీడీపీ నాయకులు షాబీర్, వీరమల్లు, శ్యామ్, సాగర్, శివస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ సీఐగా సదన్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సదన్ కుమార్

తిమ్మాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ సీఐగా సదన్ కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ సీఐగా విధులు నిర్వర్తించిన కర్రెస్వామి హైదారాబాద్‌కు బదిలీపై వెళ్లగా రాజన్న సిరిసిల్లలో సీసీఎస్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సదన్ కుమార్ తిమ్మాపూర్ సీఐగా బదిలీఅయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరంఆయన పోలీస్ స్టేషన్‌లో పీస్‌కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా రెచ్చగొట్టెలా పోస్టులు పెడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వివేక్, పీఎస్ఐ క్రాంతి కుమార్, పీఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్నకొండలో బడిబాట

చొప్పదండి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నతపాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో బడిబాట నిర్వహించారు. పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కానుగంటి రాజమౌళి మాట్లాడుతూ అనుభవంకలిగిన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను అందజేస్తున్నామని విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

నిరాదరణకు గురవుతున్న విలీన గ్రామం

● కార్యాలయానికి నోచుకోని ధర్మారం ● మూలనపడ్డ వాటర్‌ప్లాంట్ ● నిర్మాణానికి నోచుకోని శ్మశానవాటిక



ధర్మారంలో సౌకర్యాలు లేని శ్మశాన వాటిక

జమ్మికుంట రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని ధర్మారం గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. పట్టణానికి అతిసమీపంలో ఉన్న ఈగ్రామాన్ని రామన్నపల్లి, కొత్తపల్లి గ్రామాలతోకలిపి మునిసిపాలిటీలో విలీనం చేశారు. ధర్మారం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద నిధులు కేటాయించారు. దీంతోపాత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కూల్చివేశారు. అదే సమయంలో ధర్మారం గ్రామాన్ని జమ్మికుంట మునిసిపాలిటీలో విలీనం చేశారు. గ్రామానికి ఉపాధిహామీపథకం దూరం కావడంతో ఈ పథకంకింద పంచాయతీ భవన నిర్మాణానికి మంజూరైననిధులు సైతం వెనక్కివెళ్లాయి. అప్పటినుంచి పదేళ్లుగా ఈ గ్రామంలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి స్థానికంగా ఎలాంటి కార్యాలయం లేకుండా పోయింది. ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టిన సమయాల్లో టెంట్లు వేసుకోని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది వారి సామగ్రిని భద్రపరుచుకోవడానికి కనీస సౌకర్యం కూడా లేకుండాపోయింది. రెండు వార్డులు ఉన్న ఈగ్రామంలో వార్డు కార్యాలయం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయగా అవి ప్రస్తుతం పనిచేయడం లేదు. 20ఏళ్ల క్రితం గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థుల విరాళాలతో మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ వాటర్ ప్లాంట్ సైతం మూతపడింది. గ్రామ శివారులో శ్మశాన వాటిక నిర్మాణం కోసం ఇబ్బందులు తలెత్తగా ఎట్టకేలకు ఇల్లందకుంట గ్రామానికి వెళ్లే మార్గంలో స్థలం కేటాయించారు. కాని అక్కడ శ్మశాన వాటిక నిర్మాణం, నీటిసౌకర్యం చేపట్టలేదు. గ్రామంలో ఎవరైనా చనిపోయిన సందర్భంలో ట్యాంకర్ల ద్వార నీటిని తెప్పించుకొని స్నానాలు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఇన్ని సమస్యలు ఉన్న ధర్మారం గ్రామంపై అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆర్మీకి సంఘీభావంగా న్యాయవాదుల ర్యాలీ

హుజూరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో భారత ఆర్మీకి సంఘీభావంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్థాన్ ఇకనైనా ఉగ్రవాద చర్యలను విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో భారత ఆర్మీ తగిన రీతిలో బుద్ధి చెబుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్ కుమార్, ఎర్రోళ్ల రమేష్, అందె వెంకటేశ్వర రావు, భానుకిరణ్, బాగోతం కుమార స్వామి, నల్ల భూమిరెడ్డి, పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

హుజూరాబాద్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ టౌన్‌సీఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్‌ను శుక్రవారం హుజూరాబాద్ మండలకాంగ్రెస్‌పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్కరించి బొకేను అందజేశారు. సమాజంలో పోలీస్‌ల పాత్ర చాలా కీలకమన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు పోషించేపాత్ర ఎంతో అమోఘమైందన్నారు. కార్యక్రమంలోమండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొల్లూరి కిరణ్‌కుమార్,మిడిదొడ్డిరాజు, వ్యవసాయ మార్కెట్‌కమిటీడైరెక్టర్ తదితరులున్నారు.

మంచినీటి బావి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



గట్టుదుద్దెనపల్లిలో రాజగోపురానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటలో నూతనంగా చేపడుతున్న మంచి నీటిబావి నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీఅధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు గోపుమల్లారెడ్డి, మామిడి అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

దుద్దెనపల్లిలో రాజగోపురానికి..

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో రాజగోపురానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణానికి రూ.26 లక్షల నిధులను మంజూరు చేస్తామన్నారు. రాజగోపురం నిర్మాణం త్వరగా చేపట్టాలని ఆలయ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ సుప్రియ, ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, వైస్‌చైర్మన్ ఆర్ తిరుమల్‌రెడ్డి, ఆలయ కమిటీ, నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఏకమై డ్రగ్స్ నిర్మూలించాలి

చిగురుమామిడి, మే 9 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా ఏకమై డ్రగ్స్‌ని నిర్మూలించినప్పుడే యువతను కాపాడుకున్న వాళ్లం అవుతామని జేఏసీ బాధ్యులు అన్నారు. డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రలో భాగంగా మండలకేంద్రంలో జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముగింపు సభ నిర్వహించారు. కార్యక్రమంలో కంది తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్‌చైర్మన్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడమ్ లింగమూర్తి, హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హిందూ ఏక్తాయాత్ర వాల్‌పోస్టర్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోడీ రవీందర్, జిల్లాకార్యదర్శి ఉప్పు రాంకిషన్, మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

హద్దులు దాటి రోడ్డుపైకి రావద్దు

గంగాధర, మే 9 (ఆంధ్రజ్యోతి): పరిధి దాటి రోడ్డుపైకివచ్చి వ్యాపారంచేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జిఎస్సై స్వాతి అన్నారు. శుక్రవారం ప్రధానరహదారి, వ్యాపార కూడలి మధురానగర్‌లో కూరగాయలు, పండ్లు, వివిధరకాల వ్యాపారాలు జరిపేవారికి రోడ్డుపక్కన హద్దులు నిర్ణయించారు. ఈ సందర్భంగా వ్యాపారులు పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మధురానగర్ కార్యదర్శి సులోచన, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ 33కేవీ సబ్‌స్టేషన్‌పరిధిలో శనివారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడను న్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. హుజూరాబాద్‌తోపాటు తుమ్మనపల్లి, బోర్నపల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు, కాచాపూర్ సబ్‌స్టేషన్లపరిధిలో శనివారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈరఘు తెలిపారు. ఉదయం 9:30నుంచి 11:30గంటల వరకు సబ్‌స్టేషన్లలో నెలవారీ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌సరఫరా నిలిపివేస్తు న్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లపరిధిలోని కొత్తగట్టు, లింగాపూర్, కాచాపూర్, రాజాపూర్, కల్వల గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

జిల్లా అదనపు కోర్టు మంజూరు చేయాలి

హుజూరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కోర్టు సముదాయంలో జిల్లా అదనపుకోర్టు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బార్‌అసోసియేషన్ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని సీఎం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రమేష్, న్యాయవాదులు మోరె కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.